క్లుప్తంగా

పొలిటికల్ వాల్ పెయింటింగ్స్, పోస్టర్లు తొలగింపు


పోస్టర్లు, పెయింటింగ్స్ తొలగిస్తున్న జీపీ సిబ్బంది

వీణవంక: ఎన్నికల కోడ్ నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో జీపీ సిబ్బంది పొలిటికల్ సంబంధ పోస్టర్లు, వాల్ పెయింటిగ్స్‌ను తొలగిస్తున్నారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ ప్రక్రియ ముగియగా, రాష్ట్ర ఎన్నికల సంఘం కలెక్టర్లతో ఎన్నికల నిర్వహణపై కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు రెండు దఫాలుగా, సర్పంచ్, వార్డ్ మెంబర్లు ఎన్నికలు మూడు దఫాలుగా నిర్ణయించేందుకు సిద్ధమైంది. రాష్ట్ర ఎన్నికల సంఘం సూచన మేరకు గ్రామాలలో రాజకీయ సంబంధ పోస్టర్లను తొలగిస్తున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఎస్సై వంశీకృష్ణ

గంగాధర: మండలంలోని మధురానగర్ పంచాయతీ వద్ద బుధవారం ఎస్సై వంశీకృష్ణ ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. రుణాలు ఇస్తామని ఫోన్ చేసి వివరాలు అడుగుతారని, ఎలాంటి వివరాలు ఇవ్వద్దన్నారు. బహుమతి వచ్చిందని చెప్పి ఆధార్‌నంబర్, ఓటీపీ అడిగితే చెప్పొద్దని సూచించారు. ఎవరైనా మోసపోతే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

వీల్‌చైర్ అందజేత


వీల్‌చైర్ అందజేసిన ఆలయ ఫౌండేషన్ సభ్యులు

వీణవంక: మండలంలోని వల్బాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద మహిళ మారముల్ల మంగమ్మ పక్షవాతంతో బాధపడుతూ ఆలయ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ గాదె గుణసాగర్‌ను సంప్రదించగా ఫౌండేషన్ మార్గదర్శకుడు పరికిపండ్ల నరహరి ఆమెకు వీల్‌చైర్ అందజేశారు. పదేళ్లుగా ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో సేవా కార్యక్రమాలు చేస్తున్నామని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. విద్యా, వైద్యం, ఉపాధి కార్యక్రమాలు చేస్తున్నామని, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య, రక్తదాన, ఉచిత కంటి శిబిరాలు, హరితహారం, వికలాంగులకు జైపూర్ ఫుట్ సమకూరుస్తున్నామని తెలిపారు. మధ్యప్రదేశ్‌లో ఫౌండేషన్ మార్గదర్శకుడు విధులు నిర్వహిస్తూ సేవ చేయడం చాలా హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కో ఆర్డినేటర్లు గాదె గుణసాగర్, జీడి దేవేందర్, అందె కుమార్, మారముల్ల అంజి, ప్రభు, తదితరులు పాల్గొన్నారు

సన్మానం


ఆమనిని సన్మానిస్తున్న గ్రామస్తులు

రామడుగు: గ్రూప్–2లో 765వ ర్యాంకు సాధించి ఎంపీవో ఉద్యోగానికి ఎంపికైన బందారపు ఆమని, ఆమె తల్లిదండ్రులను బుధవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దర్శన్‌రావు, నాయకులు జూపాక మునీందర్, కట్ట రవీందర్, లక్ష్మీకాంతారెడ్డి, మన్నె కిషన్‌చందర్, మేకల రాజు, బుర్ర పవన్, వినయ్, భూమయ్య, గోపాల్, కరుణాకర్ పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

తిమ్మాపూర్: ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి కారు ఢీకొనడంతో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు... హుస్నాబాద్ మండలం కేశవపూర్‌కు చెందిన వెంకటస్వామిలక్ష్మి బైక్‌పై కరీంనగర్ వెళ్తుండగా వెనుక నుంచి కారు ఢీకొట్టింది. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించడానికి హెచ్‌కేఆర్ అంబులెన్స్ సిబ్బంది సకాలంలో స్పందించలేదు.

జయపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలు



గంగాధర: మండలంలోని పలు గ్రామాలలో మిత్ర మండలి సభ్యులు బుధవారం మైత్రీ గ్రూప్స్ చైర్మన్ కొత్త జయపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం అక్కడక్కడ అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

మొరాయించిన గేటు.. బస్సు లేటు



గంగాధర: మండలంలోని మంగపేట సమీపంలో కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారిపై బుధవారం రైల్వే గేటు మొరాయించింది. దీంతో ఇరువైపులా బస్సులు, ఇతర వాహనాలు, మూడు అంబులెన్సులు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. గేటును పైకి లేపడానికి సిబ్బంది గంటకుపైగా తంటాలు పడ్డారు.

మూడేళ్లుగా పట్టింపులేదు..



వీణవంక: మండలంలోని కనపర్తి గ్రామ శివారులో మూడేళ్ల క్రితం వర్షాలకు రోడ్డు సుమారు వంద మీటర్ల మేర కొట్టుకుపోయింది. దీంతో ఈ దారిగుండా వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బదులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు మరింత ప్రమాదకరంగా తయారైంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతు పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



చిగురుమామిడి: మండలంలోని చిన్నముల్కనూర్‌లో హుస్నాబాద్–కరీంనగర్ ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన వర్షపు నీరు నిల్వ ఉంటోంది. బస్టాండ్ నుంచి హుస్నాబాద్ వైపు దాదాపు అరకిలోమీటరు మేర మురుగుకాలువ లేకపోవడంతో ఏటా వర్షాకాలంలో ఇబ్బందులుపడుతున్నామని స్థానికులు, వాహనదారులు అంటున్నారు. గ్రామ ప్రత్యేకాధికారి, ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు పక్కన మురుగుకాలువ నిర్మించి నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
స్వప్న, పంచాయతీ కార్యదర్శి, సెల్: 97056 12571

వాట్సాప్ చేయండి

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227


వీణవంక: వల్బాపూర్‌లో అమ్మవారి శోభాయాత్రలో మహిళల కోలాటం


రామడుగు: శ్రీదుర్గామాత ఊరేగింపు


రామడుగు: హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

ప్రత్యేక పూజలు, చండీ హోమం

జమ్మికుంట: పట్టణం, మండలంలోని గ్రామాల్లో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని విలాసాగర్‌లో దుర్గామాతకు కేడీసీసీ వైస్ చైర్మన్ పింగిళి రమేశ్ ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని, యువతలో భక్తిభావం పెంపొందడం సంతోషంగా ఉందన్నారు.

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామంలో బుధవారం మహర్నవమిని పురస్కరించుకొని శ్రీదుర్గామాత సోమేశ్వరస్వామి ఆలయంలో భక్తులు చండీ హోమం వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. పల్లకి సేవ, గ్రామోత్సవం, అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు, దేవాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ వీర్ల ప్రభాకర్‌రావు, భవానీ భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వీణవంక: మండలంలోని గ్రామాల్లో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు తొమ్మిది రోజులపాటు ఘనంగా నిర్వహించారు. బుధవారం దుర్గామాత మండపాల వద్ద లక్కీ డ్రా నిర్వహించారు. వల్బాపూర్, నర్సింగాపూర్ గ్రామాల్లో దుర్గామాత నిమజ్జన శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. శోభాయాత్రలో మహిళల కోలాటం ఆకట్టుకుంది. వీణవంకలో యువ్ టీవీ అధినేత పాడి ఉదయానందరెడ్డి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

నిమజ్జనం త్వరగా పూర్తి చేయాలి

చొప్పదండి: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున దుర్గామాత నిమజ్జన కార్యక్రమం త్వరగా పూర్తి చేయాలని ఎస్‌ఐ నరేశ్ రెడ్డి కోరారు. బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి పదిగంటల లోపు కార్యక్రమం ముగించాలని, రాత్రి పదిగంటల తర్వాత 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. నిర్వాహకులు సహకరించి వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.


జమ్మికుంట: పూజల్లో కేడీసీసీ వైస్ చైర్మన్ రమేశ్, తదితరులు


వీణవంక: వల్బాపూర్‌లో అమ్మవారి నిమజ్జన శోభాయాత్ర

గాంధీ జయంతి ఏర్పాట్లు పరిశీలన


ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్ అయాజ్

జమ్మికుంట: పట్టణంలోని గాంధీ చౌరస్తా వద్ద మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ బుధవారం గాంధీ జయంతి ఏర్పాట్లను పరిశీలించారు. గాంధీజీ విగ్రహానికి రంగులు, వాటర్ ఫౌంటేన్, విగ్రహ పరిసరాల్లో పిచ్చిమొక్కల తొలిగింపు, శుభ్రం పనులు చేయించారు. కార్యక్రమంలో మేనేజర్ రాజిరెడ్డి, ఏఈ వికాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేశ్, సదానందం, సీనియర్ అసిస్టెంట్లు భాస్కర్, వాణి, ఈఈ శ్రీకాంత్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం'


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పి బీఆర్‌ఎస్ సత్తా చాటాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పిలుపునిచ్చారు. మండలంలోని బూరుగుపల్లి పార్టీ కార్యాలయంలో మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలేదని ఆరోపించారు. ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు ఇంటింటికి తెలియజేయాలన్నారు. మరోసారి ప్రజలను మోసం చేయాలని చూస్తుందని, సమన్వయంతో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచులను గెలిపించుకోవాలన్నారు. ప్రజల్లో కేసీఆర్‌పై అభిమానం ఉందని, రాబోయేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు.

చొప్పదండి రాంలీలాకు పదేళ్లు

చొప్పదండి: పట్టణంలోని క్రీడా మైదానంలో ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించే రాంలీలా పదేళ్లు పూర్తిచేసుకుంది. దసరా పండుగను పురస్కరించుకొని ఏటా ఆశ్వయుజ దశమిన ముఖ్య అతిథితో కార్యక్రమం నిర్వహిస్తారు. వీహెచ్‌పీ, హిందూ, రాంలీలా ఉత్సవ సమితితో పాటు పట్టణంలోని భక్త సమూహం కార్యక్రమ నిర్వహణలో పాలు పంచుకుంటున్నారు. ఏటా ముఖ్య అతిథి ఉత్సవానికి హాజరై భక్తులకు సందేశం అందిస్తుంటారు. దాతల సహకారంతో ఉత్సవం విజయవంతంగా నిర్వహిస్తారు. చొప్పదండితో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో రాంలీలా ఉత్సవానికి హాజరవుతారు.

విజయవంతం చేయాలి

రాంలీలా ఉత్సవాన్ని విజయవంతం చేయాలని ఉత్సవ సమితి అధ్యక్షుడు కటుకం మహేశ్ కోరారు. ఎస్‌ఐ నరేశ్‌రెడ్డితో కలిసి మైదానంలోని ఏర్పాట్లను పరిశీలించారు. భద్రతాపరమైన చర్యల గూర్చి చర్చించారు. ఉత్సవానికి ప్రజల తాకిడి పెరుగుతోందని, సాంస్కృతిక కార్యక్రమాలు, వక్తల ప్రసంగాలతో రాంలీలా కొత్త శోభ సంతరించుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక ప్రముఖ్ చేపూరి సత్యనారాయణ, పడకంటి కృష్ణ, దూస రాము, ఎన్నం మునీందర్, బత్తిని ప్రశాంత్, మొలుమ్మారి రమేశ్, మంచికట్ల మల్లేశం, శివశంకర్, రామకృష్ణ, అనూష్, సమర్‌రెడ్డి, మధు, సంపత్, తదితరులు పాల్గొన్నారు.


ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్‌ఐ నరేశ్‌రెడ్డి

సాదాసీదాగా రాంలీలా వేడుకలు

తిమ్మాపూర్: స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో రామ్‌లీలా సాదాసీదాగా నిర్వహించనున్నామని రామ్‌లీలా కమిటీ అధ్యక్షుడు కుంట రాజేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మహాత్మానగర్ పంచాయతీ పరిధి ఎల్‌ఎండీకాలనీలో రామ్ లీలా మైదానాన్ని పరిశీలించారు. ప్రజలు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు కేతిరెడ్డి ఎల్లారెడ్డి, గూడ కమలాకర్, అల్లాడి రఘు, లతోపాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షునికి స్వాగతం


స్వాగతం పలుకుతున్న నాయకులు

తిమ్మాపూర్: స్థానిక సంస్థల ఎన్నికలకు ఎప్పుడు పెట్టిన సిద్ధంగా ఉన్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు స్పష్టం చేశారు. కరీంనగర్‌లోని శ్రీమహాశక్తి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అల్గునూరు చౌరస్తా వద్ద రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డితో పాటు మండలంలోని నాయకులు ఘన స్వాగతం పలికారు. ఏ పార్టీతో పొత్తు పెట్టుకోబోమని ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామన్నారు. కార్యకర్తలు ఇప్పటినుంచే ప్రజలతో మమేకమై గెలుపునకు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరెడ్డి, చింతం శ్రీనివాస్, తొర్తి సంతోష్, అజయ్, నవీన్, లడ్డు, లతోపాటు పలువురు పాల్గొన్నారు.

పట్టణ ఆరోగ్య కేంద్రం తనిఖీ

కరీంనగర్‌టౌన్: సప్తగిరికాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ బుధవారం తనిఖీ చేశారు. హాజరు పట్టిక, అవుట్ పేషెంట్ రిజిస్టర్, ఇతర రికార్డులను పరిశీలించారు. ఎన్‌సీడీ రిజిస్టర్‌లలో అధిక రక్తపోటు, షుగర్ వ్యాధికి సంబంధించి పేషంట్లకు ప్రభుత్వము ఉచితంగా సరఫరా చేస్తున్న మందుల వివరాల రికార్డులను పరిశీలించారు. వ్యాధి నిరోధక టీకాలకు సంబంధించిన వ్యాక్సిన్‌లను నిల్వ ఉంచే ఐఎల్ఆర్‌ను పరిశీలించి దాని ఉష్ణోగ్రతల నమోదు రికార్డులను తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రం పరిశుభ్రతను పరిశీలించి అన్ని వేళల శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆరోగ్య మహిళ హెల్త్ క్యాంపులలో స్క్రీనింగ్ జరిగిన మహిళలను రీస్క్రీనింగ్ పూర్తి చేయాలన్నారు. డాక్టర్ సన జవేరియా, డాక్టర్ సాఫీర్ హుస్సేన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక పోరులో అన్ని స్థానాలు గెలవాలి

హుజూరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని నియోజకవర్గ ఇంచార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. నియోజకవర్గంలోని ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాలను గెలుచుకోవాలన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత కరెంట్, మహిళలకు ఉచిత బస్ సౌకర్యం, సన్నబియ్యం, రుణమాఫీ ప్రజా ప్రభుత్వ పని తీరుకు నిదర్శనమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో బీజేపీ, బీఆర్‌ఎస్ బీసీ డిక్లరేషన్ పట్ల ద్వంద్వ వైఖరి బయటపడుతుందని, బయటికి మద్దతు ప్రకటిస్తూనే లోపయికారి ఒప్పందాలు కుదుర్చుకున్నాయని, బీజేపీ రాష్ట్రపతి దగ్గర పెండింగ్‌లో ఉన్న బిల్లు గురించి మాట్లాడి ఎందుకు ఆమోదించడంలేదని ప్రశ్నించారు. పదేళ్ల పాలించిన బీఆర్‌ఎస్ రిజర్వేషన్ పెంచలేదన్నారు. ఎమ్మెల్యేగా హుజూరాబాద్ కి కౌశిక్ రెడ్డి చేసింది శూన్యమన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నామని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని మండలం ఉప్పలపల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు బుధారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. సింగాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితెల ప్రణవ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గంలోని మసీదులు, కబ్రస్తాన్‌లకు నిధులు మంజూరు చేయించినందుకు మైనార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రణవ్

ఎమ్మెల్యే పరామర్శ

చొప్పదండి: మండలంలోని కాట్నపల్లి గ్రామానికి చెందిన ట్రైనీ సర్వేయర్ లింగంపల్లి విశ్వతేజ ఇటీవల వాగులో పడి మృతి చెందగా బుధవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మృతుడి తల్లిదండ్రులను పరామర్శించి రూ.పదివేలు అందించారు. గుండ లింగమ్మ, సాంబయ్యపల్లి గ్రామానికి చెందిన మండల మనోహర్ అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.ఐదువేలు అందించారు. పట్టణంలోని ఏవైఎస్ నాయకుడు కల్లెపల్లి అరవింద్ తండ్రి ఆనందం మృతిచెందగా, ఇందిరానగర్‌కు చెందిన కొంకటి సందీప్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఎమ్మెల్యే పరామర్శించారు. వెంట కాంగ్రెస్ మండలపార్టీ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, పెరుమాండ్ల గంగయ్య గౌడ్, పురం రాజేశం, ముద్దసాని రంగయ్య, కట్టెకోల లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

వీణవంక మండలంలో ఉదయనందన్‌రెడ్డి

వీణవంక: మండలంలోని అంకుస్‌పల్లికి చెందిన గడ్డం సదానందం కుమారుడు సాయికృష్ణ ఇటీవల రైలు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న యువ్ టీవీ సీఈవో పాడి ఉదయనందన్‌రెడ్డి బుధవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే చల్లూర్ గ్రామానికి చెందిన బీజేపీ మైనారిటీ నాయకుడు అబ్దుల్ అఖిల్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అఖిల్‌పాషా కుమారుడి చదువు కోసం స్కాలర్‌షిప్ అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వీణవంక మాజీ జెడ్పీటీసీ దాసారపు ప్రభాకర్, అమత ప్రభాకర్, సమిండ్ల చిట్టీ, ఎండీ నవాజుద్దీన్, అప్పని కొమురయ్య, లోకేశ్, తాళ్లపెల్లి కుమారస్వామి, తోట్ల రాకేశ్, సిరిగిరి రాజశేఖర్, పస్తాం కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



చిగురుమామిడి: చిగురుమామిడి జిల్లా పరిషత్ పాఠశాల 2000–01 పదో తరగతి విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చదువుకున్న రోజులనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు దొబ్బల బాబు, వంగపల్లి సంపత్, అనగోని శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, జ్యోతి, శ్రీలత, సౌమ్య, అజీర, సంతోష్, రమేశ్, నరేందర్, శ్రీధర్ పలువురు పాల్గొన్నారు.

